సాక్షి బాపట్ల

శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



హుండీ ఆదాయం రూ.2.17 కోట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ హుండీల కానుకలను గురువారం లెక్కించారు. రూ.2.17 కోట్ల మేర ఆదాయం లభించింది.



జిల్లా జడ్జితో కలెక్టర్ భేటీ

గుంటూరు వెస్ట్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తిని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.

అదనపు జిల్లా జడ్జితో..



నరసరావుపేట టౌన్: 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎస్. సత్య శ్రీని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కోర్టు కార్యాలయానికి వెళ్లి మొక్క అందించారు.

న్యూస్‌రీల్

పాత వారికే బార్ టెండర్లు



చీరాల అర్బన్: చీరాలలోని బార్ అండ్ రెస్టారెంట్లకు జరిగిన లాటరీలో నాలుగు టెండర్లు పాత వారికే దక్కాయి. గురువారం జిల్లాలోని కలెక్టరేట్ కాంపౌండులో పీజీఆర్ఎస్ హాలులో జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ టెండర్ల లాటరీ డ్రా నిర్వహించారు. గతంలో ఏడు బార్లకుగాను ఒక దానికే నాలుగు టెండర్లు పడ్డాయి. మిగిలిన వాటికి రాలేదు. గడువు పెంచగా.. గురువారం ఆరు బార్‌లకుగాను నాలుగింటికి డ్రా నిర్వహించారు. ఈగల్, గాయత్రి, కనక దుర్గ, లహరి బార్ అండ్ రెస్టారెంట్లు అవకాశం దక్కించుకున్నాయి. కొత్తవారు ఎవరూ ముందుకు రాకపోవడంతో మూడు సార్లు టెండర్ల గడువును పెంచారు. చివరకు పాత వారే నాలుగు టెండర్లు దక్కించున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.ఆయేషా బేగం, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పెండింగ్ కేసులు పరిష్కరించాలి



పర్చూరు(చినగంజాం): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలోని పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలని ఒంగోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె. విజయ అన్నారు. పర్చూరులోని స్టేషన్‌ను ఆమె గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి డేటాను సమీక్షించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఒంగోలు అసిస్టెంట్ సూపరింటెండెంట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) ఎ. జనార్దన్, పర్చూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ భుజంగరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం, శ్రీధర్ బాబు, జి. రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బౌద్ధస్తూపం ఎంతో పురాతనం



భట్టిప్రోలు: స్థానిక బౌద్ధస్తూపం ఎంతో పురాతనమైనదని లోక్‌సభ ప్యానెల్ స్పీకర్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. గురువారం స్తూపాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇలాంటి స్తూపం ప్రపంచంలోనే మరెక్కడా లభించకపోవడం ప్రత్యేకత అన్నారు. బౌద్ధ వారసత్వానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి కేంద్ర నిధులను సమకూర్చి ఈ ప్రాంతాన్ని ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్టును పరిశీలించిన కేఆర్ఎంబీ చైర్మన్



విజయపురి సౌత్: కృష్ణానది యాజమాన్య బోర్డు చైర్మన్ బీపీ పాండే ఆధ్వర్యంలో సభ్యులు కేకే జాన్గిడ్ తదితరులతో కలిసి గురువారం నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. సాగర్ ప్రధాన డ్యామ్, గ్యాలరీలు, రైట్ కెనాల్, పవర్ హౌస్, ప్రధాన జల విద్యుత్ కేంద్రాన్ని పరిశీలించారు. స్వచ్ఛతా హీ సేవ క్యాంపెయిన్‌లో భాగంగా ప్రాజెక్టు అధికారులు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ప్రధాన డ్యాం, పైలాన్ పిల్లర్ పార్కులను శుభ్రపరిచారు. పార్కులో మొక్కలు నాటారు. శుక్రవారం లో లెవెల్ కెనాల్, లెఫ్ట్ కెనాల్‌లను సందర్శించనున్నారు. కేఆర్ఎంబీ ఈఈ శ్రీనివాసరావు, సాగర్ డ్యాం ఈఈ సీతారాం, డీఈ అశోక్ ఆనంద్, ఏఈ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.



ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం



ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పాలకులు చేసే తప్పులు, పొరపాట్లను ప్రజలకు చేరవేయడంలో పత్రికలది ప్రధాన పాత్ర. ప్రజాస్వామ్య పరిరక్షణలో అవి కీలకపాత్ర పోషిస్తాయి. ప్రజలకు వాస్తవాలను చేరవేస్తోందనే అక్కసుతో సాక్షిపై కక్ష సాధింపునకు దిగడం సరైన విధానం కాదు. సాక్షి ఎడిటర్, విలేకరులపై అక్రమంగా కేసులు నమోదు చేసి వాస్తవాలను బయటకు రాకుండా కుట్రను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇది పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమే. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక పత్రికలపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యంలో సరైన విధానం కాదు. సాక్షి సిబ్బందిపై ప్రభుత్వ పెద్దలు పెట్టిన కేసులను ఉపసంహరించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి.

– అంబటి మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త

వాస్తవాలు రాస్తున్నారనే అక్రమ కేసులు



ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తున్న 'సాక్షి' పత్రికపై కూటమి ప్రభుత్వం అక్కసు వెళ్లగక్కుతోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది. పత్రికలపై, విలేకరులపై అక్రమ కేసులు బనాయిస్తోంది. చంద్రబాబు పాలనలో చేసిందేమీ లేకపోయినా ఏదో అద్భుతాలు జరుగుతున్నట్లు ఎల్లో మీడియాలో చూపిస్తున్నారు. 'సాక్షి'లో వాస్తవాలు రాస్తున్నందున చంద్రబాబు బండారం ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసిపోతోంది. అందుకే 'సాక్షి' ఎడిటర్‌పై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహారం ఉంది. వాక్ స్వాతంత్ర్యాన్ని కూటమి ప్రభుత్వం కాలరాస్తోంది. తప్పులను సరిచేసుకోకుండా కక్ష సాధింపు చర్యలకు ప్రభుత్వం దిగడం సిగ్గుచేటు. ఇలాంటి అక్రమ కేసులు, అరెస్టులు 'సాక్షి'ని ఏమీ చేయలేవు.

– డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్ రెడ్డి, సత్తెనపల్లి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త

కూటమి ప్రైవేటీకరణపై ఆగ్రహ జ్వాల

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చలో మెడికల్ కాలేజీ

పేద, మధ్య తరగతి వారిపై కూటమి నేతలు తమ సవతి తల్లి ప్రేమను చాటుకుంటున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారికి వైద్య విద్య దూరం చేయడమే లక్ష్యంగా చంద్రబాబు సర్కార్ కుటిల ప్రయత్నాలు చేస్తోంది. ప్రైవేటీకరణకు తెరతీసింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తనకు కావాల్సిన వారికి ధారాదత్తం చేయడానికి రంగం సిద్ధం చేసింది. దీనిపై వైఎస్సార్‌సీపీ నేతలు గురువారం మండిపడ్డారు. మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, వైఎస్సార్‌సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సీహెచ్ అశోక్ కుమార్, బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్యలు కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బాపట్లలో శుక్రవారం జరిగే కార్యక్రమానికి ప్రతిఒక్కరూ మద్దతు తెలుపుతూ తరలిరావాలని పిలుపునిచ్చారు.



అర్ధాంతరంగా నిలిచిపోయిన బాపట్ల మెడికల్ కళాశాల

- చంద్రబాబు ప్రభుత్వ కుటిల వైఖరిపై వైఎస్సార్‌సీపీ నేతల మండిపాటు
- వైద్య కళాశాలల ప్రైవేటీకరణ కోసం చేస్తున్న ప్రయత్నాలకు ఖండన
- పేద, మధ్య తరగతికి వైద్యవిద్య, ఉచిత సేవలు దూరం అవుతాయని ఆవేదన
- అయినవారికి దోచిపెట్టడమే చంద్రబాబు నైజమని మండిపాటు
- పెద్ద ఎత్తున తరలిరావాలని యువత, విద్యార్థులు, శ్రేణులకు పిలుపు



మేరుగ నాగార్జున

బాపట్ల అర్బన్/వేమూరు/అద్దంకి: కూటమి ప్రభుత్వ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు వైద్య విద్య దూరం చేసేలా ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు ప్రయత్నాలు చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున ఆరోపించారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో బాపట్లలో 'చలో మెడికల్ కళాశాల' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు ఎన్నటికీ ప్రైవేటు వ్యక్తులు, పెట్టుబడిదారులకు మద్దతుగా వ్యవహరిస్తుంటారని గుర్తుచేశారు. పేదలు, మధ్యతరగతి వారిపై ఆయనకు చిన్నచూపు అని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంచి మనసుతో చేపట్టిన మెడికల్ కళాశాలల ఏర్పాటును చంద్రబాబు స్వార్థపూరిత ఆలోచనలతో నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. 'చలో మెడికల్ కళాశాల' కార్యక్రమానికి ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు పార్టీ ఆధ్వర్యంలో 'చలో మెడికల్ కాలేజీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు మేరుగు నాగార్జున, నియోజకవర్గ సమన్వయకర్తలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపు ఇచ్చారు.

భారీగా తరలిరావాలని పిలుపు



సీహెచ్ అశోక్ కుమార్

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బాపట్లలో శుక్రవారం జరిగే చలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి భారీగా తరలిరావాలని వైఎస్సార్‌సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సీహెచ్ అశోక్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, విద్యార్థి, యువజన విభాగ నేతలు రావాలని పిలుపునిచ్చారు.

కాలేజీల నిర్మాణం పూర్తి చేయాలి

చీరాల అర్బన్: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ డాక్టర్ల విభాగం అధ్యక్షుడు డాక్టర్ విస్తర్ల బాబూరావు అన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు ఆదేశాలతో గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు అధ్యక్షతన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. శుక్రవారం తలపెట్టిన చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని అందరూ జయప్రదం చేయాలన్నారు. ప్రైవేటీకరణను విరమించుకోకుంటే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. నిర్మాణ దశలో ఉన్న కాలేజీలను త్వరగా పూర్తి చేయాలన్నారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కోడూరి ప్రసాద్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు గోసాల అశోక్, వేటపాలెం మండల అధ్యక్షుడు సాధు రాఘవ, మాజీ అధ్యక్షుడు బి.సుబ్బారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాస్టర్, మహిళా నాయకురాలు ప్రసన్న, జిల్లా మున్సిపల్ వింగ్ సభ్యుడు కంచర్ల చక్రవర్తి, మాజీ కౌన్సిలర్ చెల్లి బాబూరావు, పార్టీ నాయకులు ఎస్.నవీన్, పోతురాజు, జంగా ప్రేమ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ బాబూరావు

పోరాటానికి మద్దతివ్వండి



కొక్కిలిగడ్డ చెంచయ్య

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు బాపట్ల జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య గురువారం మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో పేదలకు వైద్య విద్య అందుబాటులోకి తేవడానికి ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు నిర్మించాలని సంకల్పించారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఈ కాలేజీలను ప్రైవేటీకరించడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇది పేద పిల్లలకు వైద్య విద్యను దూరం చేయడమేనని పాలకుల తీరుపై మండిపడ్డారు. ప్రజలకు ఉచిత వైద్యం అందక అదనపు ఆర్థిక భారం పడుతుందన్నారు. ప్రైవేటీకరణ వలన పేద, మధ్యతరగతి వారు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. ఈ అన్యాయాన్ని అడ్డుకోవడం కోసం అందరూ ఏకతాటిపైకి రావాలని కోరారు. శుక్రవారం బాపట్ల పట్టణం రథం బజార్ పార్టీ కార్యాలయం నుంచి బాపట్ల మెడికల్ కాలేజీ వద్దకు శాంతియుత నిరసన ర్యాలీ చేపడతామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్తలు, వివిధ పార్టీ అనుబంధ జిల్లా నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విజయవంతం చేయాలి



వరికూటి అశోక్‌బాబు

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ శుక్రవారం 'చలో మెడికల్ కళాశాల' కార్యక్రమం విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నియోజక వర్గంలోని విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో కార్యక్రమం ఉంటుందని చెప్పారు. యువత, విద్యార్థులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం చాలా దారుణమని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి పేదవాడికి మంచి ఆరోగ్యం అందించాలని ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ప్రైవేటీకరణ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారని గుర్తుచేశారు. ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాల, ప్రభుత్వ వైద్యశాల ఉండాలన్నారు. వైద్య రంగాన్ని ప్రైవేటీకరణ చేయడమే చంద్రబాబు వైఖరి అన్నారు. వైఎస్ జగన్ తన పాలనలో విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రతి పాఠశాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అందులో భాగంగానే ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రవేటీకరణను అడ్డుకునేందుకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తోందని ఆయన తెలిపారు. ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జడ శ్రావణ కుమార్ విజయవాడలో ధర్నా చౌక్ వద్ద గురువారం చేపట్టిన ధర్నాకు అశోక్‌కుమార్ మద్దతు తెలిపారు.

రైతులను వెంటనే ఆదుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మేరుగ నాగార్జున, గాదె మధుసూదన రెడ్డి తదితరులు

- మాజీ మంత్రి మేరుగ, పర్చూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గాదె డిమాండ్
- యూరియా కొరతపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రైతుల నిరసన

పర్చూరు(చినగంజాం): రాష్ట్రంలో రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని, యూరియా కొరత లేకుండా చూడాలని బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డిలు డిమాండ్ చేశారు. ఎరువుల బ్లాక్ మార్కెట్, యూరియా కొరతపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గాదె మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. ముందుగా పర్చూరులోని పార్టీ కార్యాలయం నుంచి గాదె ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని రైతులు, నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలు దేరి స్థానిక బొమ్మల సెంటర్‌లోని వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి రైతులంతా శాంతియుతంగా మండల తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ పి. బ్రహ్మయ్యకు వినతి పత్రం అందజేసిన అనంతరం మాజీ మంత్రి నాగార్జున మాట్లాడారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నారన్నారు. వ్యవసాయం దండగ అని సలహా ఇచ్చిన చంద్రబాబు ... రైతులను ఇప్పటికీ ఇబ్బందులకు గురిచేస్తూ నట్టేట ముంచుతున్నారని ధ్వజమెత్తారు. ఆయన మాట్లాడుతూ వరిసాగు వలన ప్రయోజనం లేదంటూ సీఎం ఉచిత సలహాలు ఇస్తున్నారన్నారు.

బర్లీ పొగాకు రైతులకు పాట్లు

గాదె మధుసూదనరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంగా రైతులను నమ్మించి మోసగిస్తూ వస్తోందన్నారు. బర్లీ పొగాకు కొనుగోలు విషయంలో అన్నదాతలను ఇబ్బందులకు గురి చేసిందని విమర్శించారు. టీడీపీ, వైఎస్సార్ సీపీ అంటూ రైతులను విడగొట్టిందన్నారు. యూరియాను కూటమి నాయకులు ఎక్కువ రేటుకు అమ్ముతున్నారని ఆరోపించారు. జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, మాజీ జెడ్పీటీసీ భవనం శ్రీనివాసరెడ్డి, ఆరు మండలాల కన్వీనర్‌లు మున్నం నాగేశ్వరరెడ్డి, రావూరి వేణు, చిన్ని పూర్ణారావు, జంపని వీరయ్య చౌదరి, కఠారి అప్పారావు, పఠాన్ కాలేషావలి, ఉప్పలపాటి అనిల్, ముప్పాళ్ళ రాఘవయ్య, కొల్లా శ్రీహరి, శేషగిరి, ఎం.జగన్నాథం, జంగా అనిల్, దాసరి వెంకటరావు, తోకల కృష్ణమోహన్, వై.హరిప్రసాద్, కె. శ్రీనివాసరావు, జి. చిన్న, జె. శేషయ్య, వై. సుబ్బారెడ్డి, పి.వీరయ్య, డి.నరసింహారావు, రూబేను, బ్రహ్మారెడ్డి, వై. రామకృష్ణ, పి. ప్రకాష్, ఎ. సూరి, జి. ఉమాశంకరెడ్డి, బట్టు అనిల్ కుమార్, గోగినేని సతీష్, ఎన్.రామాంజనేయులు, బసవయ్య, మొగిలి నాగేశ్వరరావు, కె.అనిల్, వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, అహ్మద్, దండా చౌదరి, గోపతోటి బాబురావు, డి. వెంకటేశ్వరరెడ్డి, బుల్లిబాబు, అట్లూరి వెంకయ్య, తమ్మలూరి సురేష్, మైలా చిననాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఉద్యోగోన్నతిపై ఎంపీడీవోలుగా నియమితులైన అధికారులకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా నియామక ఉత్తర్వులను అందజేశారు. గురువారం జెడ్పీ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న నలుగురు ఏవోలు, ఆరుగురు డిప్యూటీ ఎంపీడీవోలకు ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ విడుదల చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా నియామకపత్రాలను అందజేశారు. నూతన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు తమవంతు సేవ చేయడానికి అన్ని విధాలుగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, అకౌంట్స్ అధికారి శామ్యూల్ పాల్, జీ సెక్షన్ ఏవో పూర్ణచంద్రా రెడ్డి, మోహన్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

20న బాపట్లలో జాబ్‌మేళా

బాపట్ల టౌన్: పట్టణంలోని సాల్వేషన్ ఆర్మీ ఐటీఐ కళాశాలలో ఈ నెల 20వ తేదీన జాబ్ మేళా ఉంటుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం. మాధవి గురువారం తెలిపారు. అరబిందో ఫార్మా, రిలయన్స్ ట్రేడ్స్, వరుణ్ మోటార్స్, రాయల్ మెరైన్, టీవీఎస్, టాటా ఎలక్ట్రానిక్స్, ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్‌కు సంబంధించిన ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఆయా సంస్థల్లో సుమారు 500 ఉద్యోగాలకు పైగా ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన టెన్త్, ఇంటర్, ఐటీ, డిప్లొమా, ఎంబీఏ అభ్యర్థులు అర్హులన్నారు. 18 – 30లోపు వయస్సు కలిగిన వారు ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నెంబరు తీసుకురావాలన్నారు. ముందుకు http://naipunyam.ap.gov.in/ లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పిడుగుపాటుకు రైతు మృతి



మార్టూరు: మండలంలో గురువారం సాయంత్రం వర్షం కురిసిన సమయంలో పిడుగుపాటుకు చిమ్మిరిబండ ఎస్సీ కాలనీకి చెందిన రైతు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం... రైతు దుడ్డు కొర్నేలు (56) వరి నాటడం కోసం పొలం వెళ్లాడు. సాయంత్రం కుండపోత వర్షం కురవడంతో సమీపంలోని ఓ తుమ్మ చెట్టు కిందకు వెళ్లి నిల్చున్నాడు. ఆ సమయంలో చెట్టుపై పిడుగు పడటంతో కొర్నేలు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కొర్నేలుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

సత్తెనపల్లి: విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు .. పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ గుడి ఏరియాకు చెందిన దంపతులు 10 ఏళ్ల కిందట విడిపోయారు. భర్త హైదరాబాదులో ఉంటుండగా ఆమె సిమెంట్ పనులకు వెళుతూ కుమార్తెను చదివిస్తుంది. కుమార్తె పట్టణంలోని ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యనభ్యసిస్తుంది. ఈ క్రమంలో ఆ విద్యార్థిని మున్సిపల్ కార్యాలయ ఎదురుగా ప్రకాష్‌నగర్‌కు చెందిన మున్సిపాల్టీలో స్వీపర్‌గా పనిచేస్తున్న గొల్లపల్లి పేతురుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యారు. ఏడాదిన్నర నుంచి వారి మధ్య ఫోన్ ద్వారా సంబంధాలు నడుస్తున్నాయి. ఈనెల 17న మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో పాఠశాలలో ఒకరి వద్ద ఫోన్ తీసుకొని ఆ విద్యార్థిని తనకు పరిచయస్తుడైన పేతురుకు ఫోన్ చేసింది. అతను పాఠశాల వద్దకు వచ్చి ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని తన ఇంటి వద్దకు తీసుకెళ్లాడు. విద్యార్థిని బయటకు వెళ్లి రెండు గంటలు అయినప్పటికీ రాక పోవడంతో పాఠశాలలోని ఉపాధ్యాయురాలు విద్యార్థిని తల్లికి ఫోన్ చేసి మీ కుమార్తె కడుపులో నొప్పి అని చెప్పి ఎవరికో ఫోన్ చేసి ద్విచక్ర వాహనంపై వెళ్లిందని, తిరిగి ఇంతవరకు పాఠశాలకు రాలేదని చెప్పారు. దీంతో తల్లికి అనుమానం వచ్చి ప్రకాష్‌నగర్ వెళ్లి చూడగా ఆమె అక్కడ ఉంది. దీంతో తల్లి ఎందుకు ఇక్కడ ఉన్నావని కుమార్తెను ప్రశ్నించడంతో కడుపు నొప్పిగా ఉండటం వలన వచ్చానని, ఉప్పునీళ్లు తాగినట్లు చెప్పటమే కాక తనను ఇలానే ఇబ్బంది పెడితే తాను తన తండ్రి వద్దకు వెళ్తానని వాదించింది. యువకుడి మాయమాటలు కారణంగా తన కుమార్తె ఇలా ప్రవర్తిస్తుందని గ్రహించి ఆమె పట్టణ పోలీస్‌స్టేషన్‌లో జరుగుతున్న వ్యవహారంపై ఫిర్యాదు చేయగా .. పట్టణ ఎస్ఐ గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వమే మెడికల్ కాలేజీ నిర్మించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి సింగయ్య

బాపట్ల అర్బన్: ప్రభుత్వమే బాపట్ల మెడికల్ కాలేజీని నిర్మించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సింగయ్య అన్నారు. నిర్మాణంలో ఉన్న బాపట్ల మెడికల్ కాలేజీని గురువారం ఆయన ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు, అఖిలపక్ష నేతలు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా సింగయ్య మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయటం వలన వైద్య విద్యను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు దూరం చేయొచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అన్నారు. డాక్టర్ కావాలన్న వారి కల కలగానే మిగిలిపోతుందని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా రావాల్సిన రిజర్వేషన్లు కూడా వారు కోల్పోతున్నారని చెప్పారు. చంద్రబాబు మెడికల్ సీట్లు అమ్ముకునే పరిస్థితి వస్తుందని అభిప్రాయపడ్డారు. పీపీపీ విధానం వెనుక లంచాలు, తమ సామాజిక వర్గం అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజల ఆస్తులను 63 సంవత్సరాలకు ఎలా లీజుకు ఇస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే చాలు ప్రైవేటీకరణ వైపే అడుగులు వేస్తారని మండిపడ్డారు. తన కేబినెట్లో ఉన్న మంత్రి నారాయణ, విద్యా సంస్థలు నడుపుతున్న వారికి మెడికల్ కళాశాలలను ధారాదత్తం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు కొచ్చెర్ల వినయ్ రాజు, కుల నిర్మూలన పోరాట సమితి పట్టణ కార్యదర్శి కోలా శరత్, రైతు కూలీ సంఘం కార్యదర్శి కొండయ్య, బహుజన సమాజ్ పార్టీ నాయకులు ఏపూరి జోసెఫ్ పాల్గొన్నారు.



నిలచిపోయిన బాపట్ల మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

కౌలు రైతులకు చట్టమే ఆటంకం

రైతు సంఘం సీనియర్ నేత వై.కేశవరావు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వటానికి గత ప్రభుత్వం తెచ్చిన చట్టమే ఆటంకంగా ఉందని రైతు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. కౌలు రైతు గుర్తింపు కార్డు తీసుకోవాలంటే దరఖాస్తు ఫారంలో భూ యజమాని సంతకం ఉండాలనే నిబంధన విధించడం వల్ల గుర్తింపు కార్డు దక్కట్లేదని తెలిపారు. గుంటూరు కొరిటెపాడు రామన్నపేటలోని జనచైతన్య వేదిక హాలులో మంగళవారం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ 2011 కౌలుదార్ల చట్టాన్ని సవరించి, గత ప్రభుత్వం 2019లో తెచ్చిన చట్టంతో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు దక్కటమే గగనమైందని తెలిపారు. ఈ చట్టాన్ని సవరిస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసిన టీడీపీ గెలిచాక సవరణ ముసాయిదాపై ప్రాంతీయ సదస్సులు ఏర్పాటు చేసి, ఇప్పుడు ఆ విషయాన్ని పక్కన పడేశారని తెలిపారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ కౌలు రైతుల సమస్య నేడు దేశంలో చాలా పెద్దదని, వారి సంక్షేమాన్ని పట్టించుకోకపోతే అశాంతి, అలజడి పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు , డీబీఎఫ్ వ్యవస్థాపకులు కొరివి వినయ్‌కుమార్, కిసాన్ ఫౌండేషన్ నాయకులు సూరయ్య చంద్ర, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు తదితరులు ప్రసంగించారు.



మాట్లాడుతున్న కేశవరావు

గంజాయి వినియోగిస్తున్న 9 మంది అరెస్టు

మహిళ పరారీలో ఉన్నట్లు సమాచారం

తాడేపల్లి రూరల్: కృష్ణానది తీరంలో గంజాయి తాగుతున్న తొమ్మిది మంది యువకులను తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. సీఐ వీరేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం పాతూరు కరకట్ట వద్ద కొంత మంది యువకులు గంజాయి తాగుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ ప్రతాప్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి తనిఖీ చేశారు. తొమ్మిది మంది వద్ద 810 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అరెస్టు చేసిన వారిలో బండిరెడ్డి అనిల్ అలియాస్ చిన్నబాలు, సయ్యద్ మీరా అహ్మద్, దుగ్గిరాల సాయికుమార్, తుమ్మల దుర్గా మల్లికార్జునరెడ్డి, యర్లగడ్డ గోవర్ధన్‌రావు, ఎస్.మనోజ్, మాదాసు నాగార్జున, శ్రీకాంత్, బి.ప్రసాద్ ఉన్నట్లు వివరించారు. ఎవరైనా గంజాయి తాగుతున్నా, విక్రయించినా వెంటనే తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఇదిలా ఉండగా ఉండవల్లి సెంటర్‌లో మరో మహిళ గంజాయి విక్రయిస్తున్నట్లు నిందితులు చెప్పడంతో పోలీసులు అక్కడ 350 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే, సదరు మహిళ పరారీలో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

తురకపాలెంలో జెడ్పీ చైర్‌పర్సన్ పర్యటన

గుంటూరు రూరల్: తురకపాలెం ప్రజలు ఆందోళన చెందవద్దని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తెలిపారు. అధికారులతో కలిసి గురువారం ఆమె సందర్శించారు. గ్రామంలో సంభవించిన మరణాలపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇటువంటి మరణాలు సంభవించకూడదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ కె. విజయలక్ష్మి, డీపీఓ నాగసాయికుమార్ , డెప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ, ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

పిడుగురాళ్ల: గుర్తు తెలియని వ్యక్తి మాచర్ల, గుంటూరు ప్యాసింజర్ రైలు కింద పడి మృతి చెందిన సంఘటన పిడుగురాళ్ల పట్టణంలోని జానపాడు రోడ్డులోని రైల్వే గేటు సమీపంలో గురువారం జరిగింది. సంఘటనకు సంబంధించిన వివరాలు... గుంటూరు నుంచి మాచర్ల వెళ్తున్న ప్యాసింజర్ రైలు ఢీకొనటంతో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 42 సంవత్సరాలు ఉంటుందని, మృతుడు ఎర్ర రంగు చొక్కా ధరించి ఉన్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

పీజీ ఫలితాలు విడుదల

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం పరిధిలో జూలైలో జరిగిన పీజీ కోర్సుల 2వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు గురువారం విడుదల చేశారు. ఎంఏ కోర్సుల్లో ఉర్దూ, సంస్కృతం, రూరల్ డెవలప్‌మెంట్, టూరిజం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుల ఫలితాలు విడుదల చేశారు. రీవాల్యూయేషన్‌కు ఈనెల 29లోగా ఒక్కో పేపర్‌కు రూ. 860 చెల్లించాలని సీఈ ఆలపాటి సూచించారు.

బీచ్ ఫెస్టివల్‌కు పటిష్ట బందోబస్తు

బాపట్ల టౌన్: బీచ్ ఫెస్టివల్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. గురువారం సూర్యలంక తీరంలోని ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. ఈ నెల 26, 27, 28వ తేదీల్లో వేడుకలు ఉంటాయన్నారు. 27న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సూర్యలంకకు వస్తున్న నేపథ్యంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. యాత్రికులు అత్యధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర కన్వీనర్ షేక్ అబ్దుల్ రజాక్
- జిల్లా కలెక్టర్‌కు ఉద్యమ కార్యాచరణ నోటీసు

గుంటూరు వెస్ట్: విపరీతమైన పనిభారంతో పాటు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ షేక్ అబ్దుల్ రజాక్ కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఉద్యమ కార్యాచరణ నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సర్వే విధుల నుంచి విముక్తి కలిగించి మాతృ శాఖలకు అప్పగించాలని విన్నవించారు. నోషనల్ ఇంక్రిమెంట్లు, బకాయిలు ఇప్పించాలని కోరారు. సచివాలయ ఉద్యోగులను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు అప్‌గ్రేడ్ చేయాలని, స్పష్టమైన సర్వీస్ రూల్స్ రూపొందించి పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బదిలీలకు సంబంధించి ప్రత్యేక ఆదేశాలతో జీవో ఇవ్వాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో కోశాధికారి ధనలక్ష్మి, వైస్ చైర్మన్ మధులత, మరియదాసు, జేఏసీ నాయకులు మధు, సతీష్, మహేష్, రాజారావు, బాషా, హిదాయత్, పవన్, ప్రసాద్, భరత్, సరోజిని, దీప్తి, ప్రశాంతి, గీత పావని, రాధిక పాల్గొన్నారు.

జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలి

జిల్లాలో గుర్తింపు పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘం నాయకులతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ సంఘ నాయకులతో కలసి జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. చాలా కాలం నుంచి సమావేశం నిర్వహించలేదని, సమస్యలు చెప్పుకునే అవకాశం తమకు రాలేదని పేర్కొన్నారు. తాము ప్రభుత్వంతో కలిసి ప్రజలకు ఉత్తమ సేవలందించేందుకు ఎప్పుడూ ముందుంటామని తెలిపారు. న్యాయమైన తమ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లా షాఖాద్రి, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోటా సాహెబ్, జిల్లా కోశాధికారి పోతురాజు, నగర శాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, కార్యదర్శి సుమిత్రాదేవి, షబానా, అరుణ కుమారి, రమణి పాల్గొన్నారు.



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు నోటీసు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రతిజ్ఞ చేస్తున్న డైరెక్టర్ అహెంతమ్ శాంత సింగ్ తదితరులు



ప్రతిజ్ఞ చేస్తున్న మెడికల్ విద్యార్థులు

మంగళగిరి: మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వడం వల్ల ఆత్మహత్యలను నివారించవచ్చని ఎయిమ్స్ ప్రొఫెసర్, డైరెక్టర్ డాక్టర్ అహెంతమ్ శాంత సింగ్ తెలిపారు. నగర పరిధిలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో ప్రపంచ ఆత్మహత్యల నివారణ వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం ముగింపు సందర్భంగా డాక్టర్ అహెంతమ్ శాంత సింగ్ మాట్లాడుతూ ఆత్మహత్యల నివారణకు హెల్ప్ లైన్ నంబర్ 7331115179ను ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం, సృజనాత్మకత, విమర్శనాత్మకత ప్రోత్సహించే విధంగా పెయింటింగ్, వక్తృత్వం పోటీలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఎయిమ్స్ అధికారులు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంటూరు చానల్‌లో వ్యక్తి గల్లంతు

కాజ(మంగళగిరి): గుంటూరు చానల్‌లో పడి వ్యక్తి గల్లంతైన ఘటన మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు గురువారం తెలిపిన వివరాల మేరకు... కాజ గ్రామానికి చెందిన దొడ్డక రాంబాబు(40) పొలానికి వెళ్లి వస్తూ ప్రమాదవశాత్తూ గుంటూరు చానల్‌పై ఉన్న వంతెన మీద నుంచి కాలువలో పడి గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ వెంకట్ ఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకుని, గాలింపు చర్యలు చేపట్టారు.వంతెన శిథిలావస్థకు చేరడంతో పాటు ఇరువైపులా ప్రహరీ గోడ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు స్థానికులు తెలిపారు. నీటిపారుదల శాఖ అధికారులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాంబాబు భార్య ఆర్టీసీ కండక్టర్‌గా పని చేస్తుండగా, ఇద్దరు పిల్లలున్నారని స్థానికులు తెలిపారు.



కాలువను పరిశీలిస్తున్న రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు

అతిసారం.. ప్రాణాంతకం

- కలుషిత నీరు, ఆహారంతో వ్యాప్తి
- అశ్రద్ధ చేస్తే ప్రాణాలకు ముప్పు

గుంటూరు మెడికల్: వర్షాకాలంలో వచ్చే వ్యాధుల్లో అతిసారం (డయేరియా) ముఖ్యమైంది. సకాలంలో వైద్యం చేయించని పక్షంలో ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. గుంటూరు నగరంలో మంగళ, బుధవారాల్లో 25 మంది వ్యాధి బారిన పడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఏటా వర్షాకాలంలో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అతిసార వ్యాధి కేసులు నమోదవుతూనే ఉన్నాయి. గత ఏడాది గుంటూరు నగరం శారదా కాలనీలో 326 కేసులు నమోదు కాగా, ఒకరు చికిత్స పొందుతూ చనిపోయారు. చేబ్రోలు పీహెచ్‌సీ పరిధిలోని మంచాల గ్రామంలో 62 డయేరియా కేసులు నమోదయ్యాయి. ఇటీవల నగరంలో కేసులు వస్తున్న నేపథ్యంలో వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం



జీజీహెచ్‌లో డయేరియా వార్డు

లక్షణాలు ఇవి...

- జీర్ణవ్యవస్థ పనితీరు అస్తవ్యస్తంగా ఉండి వాంతులు, విరేచనాలు నీళ్ల, నీళ్లుగా అవుతాయి.
- కడుపులో మెలి పెట్టినట్లు నొప్పి ఉంటుంది.
- నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు పోయి పిక్కల నొప్పులు వస్తాయి.
- మనం తాగే నీరు శరీరం నుంచి అధిక మొత్తంలో బయటకు వెళ్లిపోతే డీహైడ్రేషన్ ఏర్పడి ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది.
- డీహైడ్రేషన్‌లో నాడి వేగంగా లేదా బలహీనంగా కొట్టుకోవడం లేదా ఒక్కోసారి అసలు తెలియపోవడం జరుగుతుంది.
- నీరసం, నోరు, నాలుక, పిడచకట్టుకుపోవడం, శరీరం ఎండిపోవడం, ఒక్కోసారి మూత్రం అసలు రాకపోవటం లేదా చాలా తక్కువగా రావటం లేదా ముదురు పసుపు రంగులో వస్తుంది.
- వయస్సుతో సంబంధం లేకుండా డీహైడ్రేషన్ వస్తుంది. దీనివల్ల పిల్లలకు, వృద్ధులకు ఎక్కువ ప్రమాదం.

వ్యాధి సోకడానికి కారణాలు

విరోచనాలు నీళ్లగా, పలచగా అవుతుంటే డయేరియా(అతిసార వ్యాధి) అంటారు. వైద్య పరిభాషలో దీన్ని గ్యాస్ట్రో ఎంటెరైటిస్‌గా పిలుస్తారు. ఈ వ్యాధి జీర్ణవ్యవస్థకు సోకుతుంది. నీళ్ల విరేచనాలు నూటికి 70శాతం వైరస్ క్రిముల వల్ల వస్తాయి. కలుషితమైన నీటిని తాగడం వల్ల, మలం మీద వాలిన ఈగలు ఆహార పదార్థాలపై వాలిన తర్వాత తినడం ద్వారా వివిధ రకాల బ్యాక్టీరియా, వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి విరేచనాలవుతాయి.

పిల్లలకు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి

డయేరియా వల్ల పెద్దవారికంటే పిల్లలకు ఎక్కువగా ఇబ్బందికరమైన పరిస్థితులు వస్తాయి. దాహం పెరిగితే ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగించాలి. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా అందిస్తారు. ఒక ప్యాకెట్ పౌడర్‌ను లీటర్ నీటిలో కలుపుకుని తాగించాలి. విరోచనాలు అయ్యే వారికి కారం, మసాలావంటి ఘాటు పదార్థాలు పెట్టకూడదు. డయేరియా తగ్గే వరకు వైద్యుల సలహా ప్రకారం మందులు, ఆహారం అందించాలి.

కాచి చల్లార్చిన నీరు తాగాలి



డయేరియా సోకిన వారికి ద్రవ రూపంలో ఉండే ఆహారం అందజేయాలి. మజ్జిగ, పాలు, బార్లీ గంజి, పలచగా తయారు చేసిన సగ్గు బియ్యం, రాగి జావ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, సోయాబీన్స్ రసం, ఇతర పళ్ల రసాలు ఇవ్వొచ్చు. మలమూత్ర విసర్జన పిదప, భోజనం చేసే ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగడం చాలా ఉత్తమం. ఇంట్లో వైద్యాలు, మందుల షాపుల వద్దకు వెళ్లి మందులు తెచ్చుకోవడం చేయవద్దు. డయేరియా వచ్చినప్పుడు అర్హత ఉన్న వైద్య నిపుణుడి వద్దకు వెళ్లాలి.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు

ఉచితంగా వైద్య సేవలు



వర్షాకాలంలో కేసులు నమోదయ్యే దృష్ట్యా వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. బాధితులకు చికిత్స అందించేందుకు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు, సెలైన్లు, అన్ని అందుబాటులో ఉంచాం. డయేరియా సోకిన ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. ముందస్తుగా గుర్తించి నివారణ చర్యల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అతిసార వ్యాధి బాధితులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నాం.

–డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ, గుంటూరు